ఘనంగా జాతర, రథోత్సవం


పూజాది కార్యక్రమాల్లో భక్తులు, పండితులు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

• ముగిసిన ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం కనుల పండువగా సాగింది. జాతరకు పట్టణంతోపాటు మండలంలోని మారుమూల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. మంగళవారం వేకువజామున లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం పట్టణంలోని వీధుల గుండా ఊరేగించారు. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, నిమ్మగడ్డ సందీప్‌శర్మ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కల్గకుండా ఏర్పాట్లు చేశారు. ఆ లయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, భక్తులు ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ చేసిందేం లేదు

• బీఆర్‌ఎస్‌తోనే మరింత అభివృద్ధి
• నిర్మల్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
• చివరిరోజు జోరుగా ప్రచారం చేసిన నాయకులు

నిర్మల్‌టౌన్: తెలంగాణ అభివృద్ధికి కాంగ్రెస్, బీజేపీ చేసింది ఏమీ లేదని, మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమని ని ర్మల్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అ న్నారు. మంగళవారం పట్టణంలోని ఈద్గామ్, ఫిష్‌మార్కెట్, మంచిర్యాలచౌరస్తా వద్ద దుకాణాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్ వంటి పథకాలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మల్ జిల్లాగా ఏర్పడటంతోపాటు మెడికల్ కాలేజ్ వచ్చిందన్నారు. నియోజకవర్గంలో సుమారు 800 ఆలయాలను కట్టించామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో హడావుడి చేసే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు దూరం ఉండాలని ఓటర్లకు సూచించారు. నిర్మల్ ప్రజలు తనను మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, పాకాల రాంచందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మంత్రి కోడలు దివ్యారెడ్డి మండలంలోని కనకాపూర్, వడ్యాల్, రాచాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, జహీరొద్దీన్, సీరాజ్, రాజేందర్, వెంకటరాజు పాల్గొన్నారు.


ఈద్గాం వద్ద దుకాణాల్లో ప్రచారం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మామడ: మండలంలోని చందారం గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని.. ఇంద్రకరణ్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో రాంకిషన్‌రెడ్డి, లింగారెడ్డి, భాస్కర్‌రావు, శివారెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడెల్లిలో దివ్యారెడ్డి పూజలు

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం మంత్రి దివ్యారెడ్డి పూజలు చేశారు. అనంతరం ఆలయం ఎదుట మాట్లాడారు. కార్యక్రమంలో మాధవరావు, పురుషోత్తం రావు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల బైక్ ర్యాలీ..

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజనర్సయ్య, మోహినొద్దీన్ భాస్కర్, గంగయ్య, భీమయ్య తదితరులున్నారు.


మామడ: చందారంలో ప్రచారంలో నాయకులు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నరామయ్య, కందగిరి మహేందర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు తోట రమాకాంత్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. డమ్మీ ఈవీఎంలతో ఓటు వేసే విధానం వివరించారు. బీఆర్‌ఎస్ నాయకుడు తోట రమాకాంత్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు


ఆదాయం లెక్కిస్తున్న సభ్యులు

సోన్: మండలంలోని న్యూబొప్పారంలో మంగళవారం హనుమాన్ ఆలయ హుండీ ఆదాయం లెక్కించారు. కార్తీకపౌర్ణమి రోజున సమర్పించిన విరాళాలను వీడీసీ ఆధ్వర్యంలో లెక్కించగా రూ.లక్షా ఏడు వేల నూట ఇరవై సమకూరింది. ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని వీడీసీ సభ్యులు పేర్కొన్నారు.

'ఆరోపణలు సరికాదు'

భైంసాటౌన్: బీజేపీకి చెందిన మున్నూరుకాపు నాయకులు బీఆర్‌ఎస్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలని ఆ పార్టీ మున్నూరు కాపు నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరలైన ఆడియోపై నిజనిర్ధారణ చేయకుండానే ఆరోపణలు చేయడం సరికాద న్నారు. బీఆర్‌ఎస్ నాయకులు డా కిరణ్ కొమ్రేవార్, కృష్ణ, తోట రాము, రాజేశ్, రాంకుమార్ ఉన్నారు.

'అధికారుల తీరు సరికాదు'

భైంసారూరల్: మండలంలోని వాటోలి గ్రామంలో వినియోగదారులతో విద్యుత్ అధికారులు ఇష్టారీతిన మాట్లాడడం సరికాదని సర్పంచ్ నిఖిత సచిన్‌పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని వాటోలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పలు వీధుల్లో విద్యుత్ బిల్లుల వసూలు కోసం వెళ్లిన ఏఈ రాంబాబు, సిబ్బంది.. మహిళలని చూడకుండా ఇష్టారీతిన ప్రవర్తించారని పేర్కొన్నారు. అధికారులు గ్రామానికి వచ్చి క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు.

మద్యం దుకాణాలకు సీల్


కుంటాల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు సీల్ వేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి మూడు రోజులపాటు మద్యం దుకాణాలు మూసి ఉంటాయి. కొత్తగా టెండర్లు దక్కించుకున్న యజమానులు డిసెంబర్ 1న తెరవనున్నారు.

ఖానాపూర్‌లో కాంగ్రెస్ ర్యాలీ


కార్యకర్తలతో ర్యాలీ తీస్తున్న బొజ్జు

ఖానాపూర్: పట్టణంలోని వీధుల గుండా కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జుతో కలిసి విద్యానగర్ నుంచి పట్టణంతో పాటు గ్రామాల్లో ర్యాలీ తీశారు. దయానంద్, చిన్నం సత్యం, షబ్బీర్ పాషా, నిమ్మల రమేశ్, గంగనర్సయ్య, జహీర్‌హైమద్, సలీంఖాన్ ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరావ్ ప్రచారం


ముధోల్‌లో ప్రచారానికి వచ్చిన జనం

ముధోల్/భైంసాటౌన్/తానూరు: చేతి గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ముధోల్ కాంగ్రెస్ అభ్యర్థి నారాయణ్‌రావుపాటిల్ అన్నారు. మంగళవారం ము ధోల్‌లో ప్రచారం నిర్వహించారు. నారాయణ్‌రావు పటేల్ భైంసాలోని గాంధీగంజ్ నుంచి పంజేషాచౌక్, పోలీస్‌స్టేషన్, బస్టాండ్ మీదుగా రోడ్ షో నిర్వహించారు.

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారంటీలను ఓటర్లకు వివరించారు.

నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలి


భైంసాలో కవాతు చేస్తున్న బీఎస్‌ఎఫ్ బలగాలు


పుస్పూర్‌లో సిబ్బందితో కవాతు చేస్తున్న సీఐ వినోద్

భైంసాటౌన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో బీఎస్‌ఎఫ్, పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. అంతకుముందు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద వారు మాట్లాడారు ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. బీఎస్‌ఎఫ్ బలగాలు 125, మహారాష్ట్ర పోలీసులు 42 మంది, టీఎస్ఎస్పీ బెటాలియన్ పోలీసులు 50 మందితోపాటు స్థానిక పోలీసు బలగాలతో కలిపి 230 మంది ఎన్నికల బందోబస్తు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వారి వెంట పట్టణ సీఐ ఎల్ శ్రీను, ఎస్సైలు ఉన్నారు.

అల్లర్లకు దిగితే కఠిన చర్యలు

లోకేశ్వరం: ఎన్నికల సమయంలో అల్లర్లకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పుస్పూర్, లోకేశ్వరం, కన్కపూర్ గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. వారి వెంట లోకేశ్వరం ఎస్సై సాయికుమార్, సిబ్బంది ఉన్నారు.

గెలిస్తే ఏం చేస్తరు..?

• నియోజకవర్గానికి ఏం తెస్తరు..
• ఐదేళ్ల విజన్ ఏంటి..
• మీకే ఓటు ఎందుకు వేయాలి..
• మీరే ఎమ్మెల్యే ఎందుకు కావాలి..
• ప్రధాన అభ్యర్థులతో సాక్షి ఇంటర్వ్యూ

నిర్మల్: కొన్నినెలలుగా ఎదురుచూస్తున్న సందర్భం రానేవచ్చింది. అసెంబ్లీ ఎన్నికల పండుగకు ఒక్కరోజే గడువుంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మంగళవారం సాయంత్రం వరకు ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులూ జోరుగా ప్రచారం చేశారు. ఈసందర్భంగా ప్రధాన పార్టీల అభ్యర్థులతో 'సాక్షి'ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఎందుకు ఓటువేయాలి, ఎందుకు గెలిపించాలి, గెలిపిస్తే ఐదేళ్లపాటు ఏంచేస్తారు.. అనే విషయాలపై అభ్యర్థులతో చర్చించింది. 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆయా అభ్యర్థులు తెలిపిన వివరాలు వారి మాటల్లోనే..

మరింత అభివృద్ధి చేస్తాం..

– నిర్మల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



• నన్ను గెలిపిస్తే రానున్న ఐదేళ్లలో సీఎం కేసీఆర్ నిర్మల్‌కు మరింత ప్రాధాన్యతనిస్తారు.
• నిర్మల్ నియోజకవర్గంలోని మూలమూలకూ అభివృద్ధి కార్యక్రమాలను తీసుకెళ్తాం.
• పదేళ్లలో నిర్మల్ జిల్లా ఏర్పాటుతోపాటు రూ.1182 కోట్లతో 17సబ్‌స్టేషన్ల ఏర్పాటు
• రానున్న ఐదేళ్లలో నిర్మల్‌కు ఇంజినీరింగ్ కాలేజీని తీసుకువస్తాం.
• నిర్మల్‌లో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేయిస్తాం.
• విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధిరంగాలకు ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుంచుతాం.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం..

– ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్



సమస్యలతో సతమతమవుతున్న ఖానాపూర్ అభివృద్ధి కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చాను. గెలిపిస్తే ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధిని చూపిస్తాను.

• ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తాం.
• సదర్‌మాట్ బ్యారేజీ నుంచి ప్రత్యేక కాలువను తీసుకొస్తాం.
• కడెం ప్రాజెక్టును పూర్తిగా ఆధునీకరిస్తాం.
• ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయిస్తాం.
• టైగర్ రిజర్వ్‌ఫారెస్టులోని గ్రామాల సమస్యలను పరిష్కరించేదాకా పోరాడుతాం.

అన్నివర్గాల అభివృద్ధి కోసం..

– నిర్మల్ బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



రాజకీయ వారసత్వం ఉన్నా.. నేను సేవాకార్యక్రమాలతోనే ప్రజలకు చేరువయ్యాను. ఈసారి ఎన్నికల్లో ప్రజలు నన్ను గెలిపిస్తారన్న నమ్మకం ఉంది. గెలిస్తే అందుబాటులో ఉంటూ అహర్నిశలు కృషిచేస్తాను.

• నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తాం.
• జిల్లావాసుల కలగా ఉన్న రైల్వేలైన్ నిర్మాణం కేంద్రం చేపట్టనుంది. దీన్ని పూర్తిచేయిస్తాం.
• నిర్మల్‌లో ఇంజినీరింగ్‌తోపాటు వివిధ విద్యా సంస్థలు, వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తాం.
• నిర్మల్‌సభలో ప్రధాని మోదీ ఇచ్చిన గ్యారంటీ ప్రకారం కొయ్యబొమ్మలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తాం.
• స్థానిక యువతకు ఉపాధి మెరుగుపర్చేలా స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లు తీసుకొస్తాం.

అవినీతిరహిత అభివృద్ధి..



• ప్రజలకు ఇబ్బందులు లేని.. పారదర్శక పాలనే లక్ష్యం
• నిర్మల్‌ను అభివృద్ధి నమూనాగా మారుస్తాం
• నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు

తెలంగాణ ఉద్యమకారుడిగా ఏళ్లపాటు పోరాడిన నాకు నిర్మల్ నియోజకవర్గ ప్రజలు ఈసారి కచ్చితంగా ఎమ్మెల్యే అయ్యే అవకాశం ఇస్తారన్న సంపూర్ణ నమ్మకం ఉంది. ఉద్యమం నుంచే అన్ని ఊళ్లకు వెళ్లిన నాకు నియోజకవర్గంపై పూర్తి పట్టుంది. ప్రజల కష్టాలు తెలిసినవాడిని. నిర్మల్ ప్రజలు అవినీతిరహిత, పారదర్శక పాలనను కోరుకుంటున్నారు. అందుకు తగ్గట్లు ప్రజాశ్రేయస్సు కోసం వివిధ వర్గాల వారితో చర్చించి, అభివృద్ధి పనులను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాను.

అభివృద్ధికి నమూనాగా..

• నిర్మల్ అంటే కబ్జాలు, అవినీతి అనే పేరుంది. దాన్ని తుడిచేసి అభివృద్ధికి నమూనా అన్నట్లుగా తీర్చిదిద్దుతాం.
• హైదరాబాద్–నిర్మల్–ఆదిలాబాద్‌తో పాటు బాసర–భైంసా–నిర్మల్–మంచిర్యాల రైల్వేలైన్‌కూ కృషిచేస్తాం.
• నిర్మల్ పాత మాస్టర్‌ప్లాన్‌ను రద్దుచేసి, ప్రజలకు అనుకూలమైన కొత్త ప్లాన్ తీసుకువస్తాం.
• నిర్మల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని ఏర్పాటుచేస్తాం.
• జిల్లాను పర్యాటక కారిడార్‌గా రూపొందిస్తాం.
• అన్నివర్గాల మేధావులతో చర్చిస్తూ.. అన్నివర్గాల సంక్షేమ కార్యక్రమాలను సమష్టిగా చేపడతాం.

ఈఒక్కసారి ఎమ్మెల్యే అయ్యే అవకాశం ప్రజలు నాకు ఇస్తారని ఆశిస్తున్నాను. వారు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతాను.

'ఏలేటి'ని గెలిపించాలని ప్రచారం

సారంగాపూర్: ఈసారి బీజేపీ అధికారంలోకి వస్తేనే నిర్మల్ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సతీమణి కవితారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అడెల్లి గ్రామంలో మంగళవారం ఎన్నికల నిర్వహించారు. అడెల్లిలో ఒక్కరికీ కూడా దళితబంధు అందలేదంటే ప్రజలు ఆలోచించాలని కోరారు. మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవడం.. గద్దెనెక్కాక మొండిచెయి చూపడం సీఎం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. కార్యక్రమంలో చంద్రప్రకాశ్‌గౌడ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డి విజయం సాధించాలని కోరుతూ మంగళవారం మండలంలోని చామన్‌పెల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకులతో కలిసి యువకులు, మహిళలు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మార వెంకట్‌రెడ్డి, న్యాయవాది కొమ్మోజి రమణ, పడిగెల సురేశ్, అరటి శ్రీనివాస్, రమేశ్, ప్రగత్ పాల్గొన్నారు.


లక్ష్మణచాంద: చామన్‌పల్లిలో రామాలయం వద్ద బీజేపీ నాయకులు, గ్రామస్తులు


అడెల్లిలో 'ఏలేటి' సతీమణి కవితారెడ్డి ప్రచారం

సోన్: మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని మండలంలోని జాఫ్రపూర్ గ్రామంలో మంగళవారం ఎంపీపీ బర్ల మానసరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో హరీశ్‌రెడ్డి, భూమయ్య, రాజు, భూమారెడ్డి, నవీన్, వినిత్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు.

అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

• ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఖానాపూర్: నియోజకవర్గ అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఖానాపూర్ బీర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మంత్రి కేటీఆర్ సహకారంతో ఖానాపూర్‌ను సుందరంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంకం రాజేందర్, ఖలీల్, పరిమి సురేశ్, లత, కారింగుల సంకీర్తన, సుమన్, జన్నారపు విజయలక్ష్మి, కావలి సంతోశ్, తొంటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ప్రజలు ఆలోచించి ఓటేయండి

కడెం: ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటేయాలని ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు పైడిపల్లి రవీందరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ఈసందర్భంగా దస్తురాబాద్ మండలం ఆకొండపేట్‌కు చెందిన పలువురు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రవీందర్‌రావు పేదల భూములు గుంజుకున్నారని కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సుధాకర్‌రావు, వెంకటేశ్, రాజన్న, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నేత 'కూచాడి'ని ఆదరించండి

లక్ష్మణచాంద: ఉద్యమ నేత శ్రీహరిరావును నిర్మల్ ఎమ్మెల్యేగా గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం మండలకేంద్రంతోపాటు వడ్యాల్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈసందర్భంగా అట్ల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముందుండి ఉద్యమాన్ని నడిపించిన వ్యక్తి శ్రీహరిరావు అన్నారు. ఆయనతోనే నిర్మల్ జిల్లా అభివృద్ధి సాధ్యమని.. ఈనెల 30న జరిగే చేతి గుర్తుకు ఓటు వేసి ఉద్యమ నేత శ్రీహరిరావును గెలిపించాలని ఆయన కోరారు. ఇందులో పలువురు కాంగ్రెస్ నాయకులు అట్ల రాంరెడ్డి, చిన్న రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, రాజేందర్, రవి, నాగేశ్ తదితరులు ఉన్నారు.


వడ్యాల్‌లో ప్రచారం చేస్తున్న రవీందర్‌రెడ్డి

బీజేపీ అభ్యర్థి రామారావ్ పటేల్ ప్రచారం

భైంసాటౌన్: స్థానిక జుల్ఫికర్‌గల్లీలోని హనుమాన్ మందిర్ నుంచి బీజేపీ ముధోల్ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ ప్రచార ర్యాలీ ప్రారంభించారు. భట్టిగల్లి, గణేశ్‌నగర్, పురాణబజార్, పంజేషాచౌక్ మీదుగా కపడా మార్కెట్, బస్టాండ్ రోడ్డు మీదుగా శివారు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు.

లోకేశ్వరం: పంచగుడి, ధర్మోర, వట్టోలి, లోకేశ్వరం, గడ్‌చాంద, పుస్పూర్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారం చేశారు.


భైంసాలో రామారావుపటేల్, నేతల ప్రచారం

ముధోల్: మచ్కల్, రాంటెక్, ముద్గల్, న్యూముద్గల్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారం చేశారు.

ఓటుపై కరపత్రం ఆవిష్కరణ

సోన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సోన్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు ప్రాధాన్యం వివరిస్తూ ఓటు విలువ తెలుసుకో మన భవిష్యత్తుకు మంచి బాట వేసుకో అనే అంశంపై కరపత్రం ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు ఆరాధన, ఉపాధ్యాయులు నాగయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ కరపత్రం రూపొందించారు. ఓటును అమ్ముకోవద్దని విద్యార్థులు సూచించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ తదితరులున్నారు.

విఠల్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

కుంటాల: ముధోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు మండలంలోని మెదన్‌పూర్‌లో ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ చిన్న రాజలింగు, చౌహాన్ రాజు, సంజీవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంతోపాటు కన్కపూర్, పిప్రి, నగర్, గడ్‌చాంద, పంచగుడి, ధర్మోర, వట్టోలి గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లోలం శ్యాంసుందర్, రత్నాకర్‌రావు ఉన్నారు.

నమూనా ఎన్నికలు

మామడ: మండలంలోని ఆరేపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభ్యర్థుల పోటీ, ప్రచారంపై ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష్‌కుమార్, శ్రీకాంత్ ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ : జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899